క్లుప్తంగా

రుణసాయం అందరికీ అందించాలి

మన్ననూర్: రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు దరఖాస్తు చేసుకున్న బీసీలందరికీ రూ.లక్ష రుణ సాయం అందించాలని మండల కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రహీం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ బీసీలకు ఇస్తామని ప్రకటించిన రుణ సాయం ఎన్నికల స్టంట్ కాకుండా చిత్తశుద్ధిని ప్రదర్శించి రుణం అందించేలా ఉండాలని అన్నారు.

సుద్దకల్‌లో వైద్యశిబిరం



కల్వకుర్తిరూరల్: మండలంలోని సుద్దకల్‌లో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఉప్పల అఖిల్, కామినేని ఆస్పత్రి వైద్యుల సహకారంతో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో 223 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. సర్పంచ్ వనజా రెడ్డి, నిర్మల, మల్లేష్, గణేష్, కాశన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రిత్విక

కల్వకుర్తి: పట్టణంలోని బ్రిలియంట్ పాఠశాలకు చెందిన రిత్విక రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రేణుధర్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్‌లో నిర్వహించే ఈ పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు తరపున రిత్విక పోటీల్లో పాల్గొననుందన్నారు. పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంపై పాఠశాల డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి విద్యార్థిని అభినందించారు.

పెంపుడు జంతువులకు వ్యాక్సిన్లు వేయించాలి

కొల్లాపూర్: పెంపుడు జంతువులకు రోగాలు రాకుండా అవసరమైన వ్యాక్సిన్లు వేయించాలని వెటర్నరీ వైద్యులు యాదగిరి సూచించారు. వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా బుధవారం పెంపుడు జంతువులకు ఏఆర్‌వీ వ్యాక్సిన్లు వేశారు. ప్రతిఒక్కరూ తమ పెంపుడు జంతువులకు వ్యాక్సిన్లు వేయించాలన్నారు. వ్యాక్సిన్లు వేయిస్తే జంతువులు మనుషులను కరిచినా, రక్కినా ఎటువంటి ప్రమాదం ఉండదన్నారు. వ్యాక్సిన్లు వెటర్నరీ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు.

చారకొండ: గ్రామాల్లో పెంచుకునే కుక్కలకు యజమానులు తప్పకుండా వ్యాక్సిన్ వేయించాలని మండల పశువైద్య అధికారి శివకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నేటి నుంచి వారం రోజుల పాటు గ్రామాల్లో పశువైద్యశాలలో వాక్సిన్ కొనసాగుతుందని అన్నారు. యజమానులు వాక్సిన్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

8న పుస్తక ఆవిష్కరణ

అమ్రాబాద్: మండలంలోని మాదవానిపల్లికి చెందిన రఘుపతిరావు రచించిన 'కాలం మరువని యోధులు' పుస్తక ఆవిష్కరణ ఈ నెల 8న శనివారం అచ్చంపేట సత్యలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ఉంటుందని పాలమూరు అధ్యయన వేదిక నాయకులు నారాయణ, లక్ష్మినారాయణ, పాండులు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం పది గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాలమూరు అధ్యయన వేదిక వెంకట్, ప్రొఫెసర్ హరగోపాల్, సూరెపల్లి సుజాత, పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, తదితరులు హాజరవుతున్నారని వివరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పుస్తకాలు పంపిణీ చేయాలని వినతి



పెంట్లవెల్లి: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ పోస్టులు భర్తీ చేసి, అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను వెంటనే పంపిణీ చేయాలని ఎస్ఎఫ్ఐ నియోజకవర్గ అధ్యక్షుడు తరుణ్ అన్నారు. అందులో భాగంగా బుధవారం పలువురు విద్యార్థులతో పలు అంశాలపై తహసీల్దార్ దామోదర్‌కు వినతి అందజేశారు. రాకేష్, రాజేష్, చరణ్, ప్రవీన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పంపిణీ

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్ఐడీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్‌గౌడ్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం కోర్సులు చదువుతున్న విద్యార్థినులందరికీ పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పొంది, ఉచితంగా అందించే పాఠ్య పుస్తకాలు, ఇతర వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డ్రమ్ సీడర్‌తో వరిసాగు ఉత్తమం



ఎల్లూరులో డ్రమ్‌సీడర్ పద్ధతి ద్వారా వరి సాగును వివరిస్తున్న అధికారులు

కొల్లాపూర్ రూరల్: డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు చేస్తే అధిక లాభాలు వస్తాయని మండల వ్యవసాయ అధికారి నాగరాజు సూచించారు. బుధవారం మండల పరిధిలోని ఎల్లూరులో డ్రమ్ సీడర్ ద్వారా ఒక రైతు సాగు చేస్తున్న పద్ధతిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ పద్ధతి ద్వారా వరిసాగు చేస్తే ఖర్చు బాగా తగ్గుతుందన్నారు. విత్తనం మోతాదు మరియు నాట్లు ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. విత్తనాలు వరసలో పడడంతో గాలి, వెలుతురు బాగా తగిలి పిలకలు ఎక్కువగా వస్తాయన్నారు. తెగుళ్ల ఉధృతి తక్కువగా ఉంటుందన్నారు. 7 నుంచి 10 రోజులు ముందుగానే కోతకు రావడం జరుగుతుందన్నారు. మండల స్థాయి రైతులు ఈ పద్ధతిని పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మౌనిక తదితర రైతులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు చర్యలు



షీ టీం వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న సభ్యులు, విద్యార్థులు

అచ్చంపేట రూరల్: మహిళల భద్రత కోసం షీ టీం ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు చేపడుతున్నామని షీ టీం ఇన్‌చార్జ్ ఏఎస్ఐ ఇందిర, ఏఎస్ఐ జిలానీ అన్నారు. బుధవారం అచ్చంపేటలోని ఓ పాఠశాలలో విద్యార్థులకు షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షీ టీంను సంప్రదించే విధానం వివరించారు. క్యూఆర్ కోడ్, లింగ సమానత్వం, మానవ అక్రమ రవాణా, సోషల్ మీడియా వేధింపులు, బాలకార్మికులు, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, డయల్ 100, 1098, 1930 వాటిపై వివరించారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. రమణ, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి



పౌల్ట్రీ ఫాం యూనిట్ రిబ్బన్ కట్ చేస్తున్న సర్పంచ్

చారకొండ: ప్రభుత్వం దళితబంధు పథకం ద్వార మంజూరు చేసిన యూనిట్‌ను సద్వినియోగం చేసుకుని కుటుంబం ఆర్థికంగా పరిపుష్టి సాధించాలని జూపల్లి సర్పంచ్ మల్లీశ్వరి బాలరాజు సూచించారు. మండలంలోని జూపల్లిలో దళితబంధు యూనిట్‌లో గ్రామానికి చెందిన కంబాలపల్లి నారమ్మ భర్త మైసయ్య కుటుంబం పౌల్ట్రీఫాం యూనిట్‌ను ఎంచుకుని అదనంగా మరో రూ.7 లక్షలు సొంతంగా ఖర్చు చేసి నిర్మాణం చేపట్టారు. బుధవారం సర్పంచ్ మల్లీశ్వరి, రైతు సమితి అధ్యక్షుడు కటయ్య యాదవ్, నాయకులు బాలేమియా హాజరై యూనిట్‌ను రిబ్బన్ కట్ చేస్తూ.. ప్రారంభించారు.

ఇంకుడుగుంతల నిర్మాణంపై అవగాహన



గుంతకోడూరులో నిర్మిస్తున్న ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ గంగా మోహన్ అన్నారు. బుధవారం మండలంలోని గుంతకోడూరులో నిర్మిస్తున్న కమ్యూనిటీ ఇంకుడు గుంతను పరిశీలించి పంచాయతీ కార్యదర్శి రామస్వామికి అవగాహన కల్పించారు. గ్రామంలోని డ్రెయినేజీల చివరణ ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. మురుగునీరంతా వృథా కాకుండా నిర్మాణం చేపట్టాలన్నారు.

రైతువేదికను పరిశీలించిన అధికారులు



రైతువేదికను పరిశీలిస్తున్న అధికారులు

కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్రాలో నిర్మించిన రైతువేదికతో పాటు వైకుంఠధామం, నర్సరీలను డివిజనల్ పంచాయతీ అధికారి పండరీనాథ్, ఎంపీడీఓ ఆంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు పక్కల ఉపాధిహామీ కూలీలు నాటుతున్న మొక్కలను పరిశీలించి వారికి సూచనలు చేశారు. అనంతరం ఉపాధిహామీ కార్యాలయంలో సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనుల వివరాలను సమీక్షించారు. అమృత్‌మన్, గంగయ్య, దేవేందర్, చంద్రసిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



తెలకపల్లి: నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డిని తెలకపల్లి బీఆర్ఎస్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిశారు. తెలకపల్లి మండల కేంద్రానికి ఎమ్మెల్యే ప్రత్యేక నిధుల నుంచి తెలకపల్లి అభివృద్ధికి రూ.కోటి మంజూరు చేశారు. ఎంపీటీసీ సభ్యులు లక్ష్మమ్మ, విజయలక్ష్మి, కృష్ణయ్య, యాదయ్య, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

30 శాతం పీఆర్‌సీ ఇవ్వాలి

తాడూరు: పంచాయతీ కార్మికులకు రూ.26 వేల వేతనంతో పాటు 30 శాతం పీఆర్‌సీ అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.శ్రీను డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని తుమ్మలసూర్, చర్లతిరుమలాపురం గ్రామాల్లో జూలై 5న అర్ధరాత్రి నుంచి తలపెట్టనున్న నిరవధిక సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న, పంచాయతీ సిబ్బంది సుబ్బయ్య, కైరత్, ఎల్లయ్య, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షుడిగా మహేష్

నాగర్‌కర్నూల్ రూరల్: నాగర్‌కర్నూల్ అసెంబ్లీ బీఎస్పీ అధ్యక్షుడిగా మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా మల్లేష్‌ను, తెలకపల్లి మండల కార్యదర్శిగా కళ్యాణ్‌ను ఎంపిక చేశారు. రామకృష్ణ, యోసోప్, పృథ్వీరాజు, పరశురాములు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

అమ్రాబాద్: పదర మండలం జోత్యనాయక్‌తండాకు చెందిన 30మంది యువకులు బుధవారం మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పదర కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామలింగయ్య యాదవ్, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు జోత్యనాయక్‌తండా యువకులు తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం పనిచేస్తామని వివరించారు.

సమస్య పరిష్కారం

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని నలమల సమీపంలోని గేమ్యానాయక్ తండాలో తాగునీరు లేక ఇబ్బంది ఎదుర్కొంటున్న తరుణంలో ఇటీవల ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తండాను సందర్శించారు. తండావాసులు తాగునీటి సమస్య ఉందని చెప్పడంతో తక్షణమే అధికారులను ఆదేశించి బోర్ వేయించారు. ఆ బోర్‌ను బుధవారం సర్పంచ్ దశరథం నాయక్ ప్రారంభించారు.

పాఠశాల పరిశీలన

తాడూరు: మండలంలోని ఐతోల్ పాఠశాలలో బుధవారం కాంప్లెక్స్ చైర్మన్ తిరుపతయ్య ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు.

భాస్కర్‌రెడ్డికి ఘన నివాళి

కల్వకుర్తి రూరల్: బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి భాస్కర్‌రెడ్డికి బుధవారం అసోసియేషన్ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిల్వర్‌జూబ్లీ క్లబ్ అధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడారు. అత్యంత చిన్న వయసులోనే గుండెపోటుతో భాస్కర్‌రెడ్డి మృతిచెందడం బాధాకరమన్నారు. ఈశ్వర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రమౌళి, రాజు, దామోదర్‌రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

ఈటలకు సన్మానం



కల్వకుర్తి: బీజేపీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా నియామకమై ఈటల రాజేందర్‌ను బుధవారం హైదరాబాద్‌లో కల్వకుర్తి బీజేపీ నాయకులు సన్మానించారు. ఈటలను శాలువాతో సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేసి ఆచారిని ఎమ్మెల్యేగా గెలిపించాలని రాజేందర్ కార్యకర్తలకు సూచించారు. రాజేందర్‌గౌడ్, దుర్గాప్రసాద్ పలువురు పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

బిజినేపల్లి: మండల కేంద్రానికి చెందిన అలివేలు(60) మే 20 నుంచి కనిపించడం లేదని బిజినేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జ్ ఎస్ఐ సద్దాం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన అలివేల బిజినేపల్లిలో ఒంటరిగా నివాసం ఉంటుంది. మే 20 నుంచి బిజినేపల్లి బస్టాండ్ ప్రాంగణం నుంచి కన్పించడం లేదని, నెల రోజుల పాటు వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆమె కుమారుడు బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

చోరీ కేసు నమోదు

బిజినేపల్లి: మండలంలోని కొట్బాల్‌గడ్డకి చెందిన నరేందర్‌రెడ్డి ఇంట్లో ఆభరణాలు, కొంత నగదును గుర్తు తెలియని దుండగులు చోరీ చేసినట్లు బిజినేపల్లి పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. ఇన్‌చార్జ్ ఎస్ఐ సద్దాం తెలిపిన వివరాల ప్రకారం.. నరేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు 15 రోజుల కిందట బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం రాత్రి తిరిగి వచ్చి చూడగా.. ఇంట్లో దొంగలు పడినట్లు గుర్తించారు. ఇంట్లోని 15 తులాల వెండి, కొంత నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలియజేశారు.

సారా పట్టివేత కేసు నమోదు

బల్మూర్: మండలంలోని నర్సాయపల్లికి చెందిన పాండు బల్మూర్‌లో సారా విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐలు బాలరాజు, సతీష్‌కుమార్ బుధవారం తెలియజేశారు. పాండు కొంత కాలంగా అక్రమంగా సారా బట్టీలు ఏర్పాటు చేసి మండల కేంద్రంలో విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు మంగళవారం రాత్రి దారి కాచి బైక్‌పై నాలుగు లీటర్ల సారా తరలిస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. తహసీల్దార్ ఎదుట హాజరు పర్చామని వివరించారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

వంగూర్: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ లక్ష్మమ్మ(75) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందింది. బుధవారం అంత్యక్రియల్లో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, ఎంపీ రాములు, మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ, నివాళి అర్పించారు. అదే విధంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మండల అధికారులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



కల్వకుర్తి రూరల్: సీఎం సహాయనిధి చెక్కులను ఎంపీ రాములు బుధవారం క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. మండలంలోని తోటపల్లికి చెందిన లలితమ్మకు మంజూరైన రూ.16,000 సీఎం సహాయనిధి చెక్కును బాధితురాలి భర్త జానకిరాముకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ రాములు మాట్లాడారు. సీఎం సహాయనిధి పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు.

కోడేరు వాసికి ఎంఫిల్ పట్టా



కోడేరు: మండల కేంద్రానికి చెందిన ఎం.డి. రహీం పాష ఎంఫిల్ పట్టా అందుకున్నాడు. ప్రొఫెసర్ జేఎస్ గాబ్రియల్ పర్యవేక్షణలో పరిశోధన చేయడంతో భాష శాస్త్ర శాఖ ప్రొఫెసర్ డీన్ వైఆర్ శ్యామల అభినందించి ఎంఫిల్ పట్టా అందజేశారు.

సైబర్ నేరాలపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామేశ్వర్‌రెడ్డి

పెంట్లవెల్లి: మండల పరిధిలోని మాదవస్వామినగర్‌లో సైబర్ నేరాలపై బుధవారం ఎస్ఐ రామేశ్వర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో సైబర్‌నేరాలు ఎక్కువయ్యాయన్నారు. ముఖ్యంగా వాట్సప్, ఇన్‌స్టాగాం, పేస్‌బుక్, ఎవరైన తెలియని వారు ఫోన్ చేసినా.. మెసేజ్ చేసిన ఆధార్‌కార్డు నంబర్ లేదా బ్యాంక్ అకౌంట్ నంబర్ అడిగినా నంబర్లు ఇవ్వవద్దని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, మూర్తి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

లింగాల: మండల పరిధిలోని అంబట్‌పల్లికి చెందిన పెద్దరాములు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఇంటి వద్ద ఉన్నాడు. విషయం తెలుసుకున్న సింగిల్‌విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి బుధవారం బాధిత వ్యక్తిని పరామర్శించారు. రూ.4 వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఓటు హక్కు కల్పించాలి



వెల్దండలో బీఎల్‌ఓలకు ప్రత్యేక సమావేశం నిర్వహించిన తహసీల్దార్ రవికుమార్

వెల్దండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌ఓలకు తహసీల్దార్ రవికుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి పౌరుడుకు ఓటు హక్కు కల్పించాలని పేర్కొన్నారు. తప్పులు లేకుండా ఓటరు లిస్టులను సిద్ధం చేయాలన్నారు. గ్రామాల్లో ఓటరు లిస్టులను పరిశీలించి ఆధార్ నంబర్‌ను ఆన్‌లైన్ చేయాలన్నారు. 18 ఏళ్ల వయస్సు కల్గిన యువతి, యువకులకు ఫారం -6 ద్వారా ఓటు హక్కును కల్పించాలన్నారు. మరణించిన వ్యక్తులను గుర్తించి తొలగించాలని, డబుల్ ఓటరును గుర్తించి తొలగించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటరు జాబితా సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు.

తప్పొప్పులు సరిచేయాలి..

చారకొండ: ఓటరు జాబితాలోని తప్పొప్పులను సరిచేయాలని, ఆ దిశగా గ్రామాల్లో బీఎల్‌ఓలు పని చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్ రావు అన్నారు. మండలంలోని అచ్చంపేట నియోజకవర్గ గ్రామాలు బూత్‌ల వారీగా తిమ్మాయిపల్లి, తుర్కలపల్లి, చారకొండ, సిర్సనగండ్ల గ్రామాల్లో బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎస్ఐ రవి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

సాగుకు విత్తనాల ఎంపిక తప్పనిసరి



చెంచు రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

లింగాల: పంటలను సాగుచేసే ముందు భూముల స్వభావాన్ని బట్టీ విత్తనాలను ఎంపిక చేసుకుంటే మంచిదని మండల వ్యవసాయాధికారి నాగార్జున రెడ్డి చెంచు రైతులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని చెంచు మహిళా సమాఖ్యలో ఏఫికార్ న్యూఢిల్లీ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఎర్రపెంట, పద్మనపల్లి, దారారం, అప్పాయపల్లి, కొత్తచెర్వుతండా చెంచు రైతులకు మొక్కజొన్న, వరి విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడారు. ప్రతి ఏటా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. విత్తనాల ఎంపిక ఎంతో అవసరమని తెలియజేశారు. ఎరువుల వాడకం, సాగులో అనుసరించాల్సిన మెళుకువలపై అవగాహన కల్పించారు. సంస్థ ప్రతినిధులు భూల్యా, శ్రీను, స్రవంతి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐక్యమత్యంతో హక్కులు సాధించుకుందాం



లింగాలలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీసీలు

లింగాల: బీసీలోని అన్ని ఉపకులాల వారందరం సమైక్యంగా ఉంటూ హక్కులను సాధించుకుందామని ఐక్యవేదిక మండల నాయకులు రాజలయ్య, సత్యం, శివ, హరితేజగౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్, ఏకలవ్య విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం ఐక్యవేదిక నాయకులు మాట్లాడారు. జనాభాలో 60 శాతం వరకు ఉన్న బీసీలు నేటికి వివక్షకు గురికావాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కమిటీల ఏర్పాటు అయ్యాక మండల కమిటీని ఎన్నుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో బీసీలోని అన్ని ఉపకులాల వారు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల ఆకస్మిక తనిఖీ



చారకొండలో తనిఖీ చేస్తున్న ఏడీఏ చంద్రశేఖర్

చారకొండ: విత్తన డీలర్లు తమ దుకాణాల్లో లైసెన్స్, స్టాక్ బోర్డు కనిపించేలా అమర్చాలని అచ్చంపేట సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో నకిలీ విత్తనాలు, గడువు ముగిసిన వాటిపై ప్రత్యేకంగా దుకాణాల్లో పరిశీలించారు. డీలర్లు తమ వద్ద ఉన్న స్టాక్‌ను వివరాలను తెలిపేలా స్టాక్ రిజిస్టార్ నమోదు చేయాలన్నారు. రైతులకు విక్రయించిన వాటిపై రైతులకు నిర్ణీత ధరకు రశీదులు చెల్లించాలని సూచించారు. తనిఖీలో చారకొండ వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్, అమ్రాబాద్ వ్యవసాయ అధికారి సందీప్ డీలర్లు పాల్గొన్నారు.

పథకాలపై ఉస్మానియా బృందం సర్వే



యూనివర్సిటీ బృందంతో అధికారులు

చారకొండ: మండలంలోని గిరిజన తండాలు సారంబండ తండా, నూకలచింతవాడిక తండాల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థుల బృందం బుధవారం తండాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, వాటి పనితీరుపై సర్వే చేపట్టారు. సంబంధిత అభివృద్ధి పనులపై జియో టాగింగ్ ఫొటోలు తీసుకున్నారు. సారంబండ తండా సర్పంచ్ రాజు నాయక్ గ్రామ సభ నిర్వహించారు. డీఎల్‌పీఓ పండరినాథ్, చంద్రశేఖర్, జయసుధ, వెంకటేష్ ఉన్నారు.

విద్యార్థులకు చేయూత



బాధిత కుటుంబ సభ్యులకు పత్రాలను అందజేస్తున్న కంపెనీ సభ్యులు

వెల్దండ: మండల పరిధిలోని తుమ్మలకుంట తండాకు చెందిన రామావత్ రాంజా మృతిచెందడంతో వారి కుటుంబానికి కంపెనీ వారు అండగా నిలిచారు. బుధవారం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో కంపెనీ వారు విద్యార్థులకు చేయూత అందించారు. కంపెనీ నుంచి వారికి రూ.30 లక్షలను మంజూరు చేసి మృతుని భార్య భారతి పేరున రూ.10 లక్షలు, కుమారులు అజయ్‌కు రూ.10 లక్షలు, లోక్యకు రూ.10 లక్షల చొప్పున బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. సంబంధించిన పత్రాలను కంపెనీ వారు అందజేశారు. నాయకులు శంకర్‌నాయక్, బురియనాయక్, సితియనాయక్, శ్రీనునాయక్ తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

తెలకపల్లి: బీఎస్పీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు రెడ్డపాకుల శివశంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికలు దగ్గరపడుతున్నాయని, బీఎస్పీ కార్యకర్త బీఎస్పీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. మండల ఉపాధ్యక్షుడిగా మల్లేష్, కార్యదర్శిగా బాలరాజు, కోశాధికారిగా సాయిబాబును ఎన్నుకున్నారు.